


శ్రీశైలం సబ్ డీఎఫ్‌వోగా అబ్దుల్ రవూఫ్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ శిక్షణ పూర్తి చేసుకున్న 2022 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు ఐఎఫ్ఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శ్రీశైలం సబ్ డీఎఫ్‌వోగా మహమ్మద్ అబ్దుల్ రవూఫ్‌ను కేటాయించారు. ఈయనతో పాటు అన్నమయ్య జిల్లా కోడూరు సబ్ డీఎఫ్‌వోగా జి.సుబ్బురాజ్‌కు పోస్టింగ్ ఇవ్వగా, శుభంను పీసీసీఎఫ్ ప్రధాన కార్యాలయంలో నేరుగా రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



వందనాలు



- నేటికి టీడీపీ కూటమి ప్రభుత్వానికి వంద రోజులు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూటమికి చారిత్రక విజయం
- ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధికి రూ.2,786 కోట్లు
- ఉద్యోగుల బదిలీలతోనే వంద రోజులు పూర్తి
- జిల్లా ప్రగతిపై ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి

కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

జూన్ 12.. ఆ రోజు ఉదయం 9.27 గంటలు... గన్నవరం సమీపంలోని కేసరిపల్లి ఐటీ వేదిక... నాలుగోసారి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడి ప్రమాణ స్వీకారం. సరిగ్గా నేటికి వంద రోజులు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సారథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూన్ 12న కొలువుదీరింది. చంద్రబాబు మంత్రివర్గంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలకు స్థానం దక్కింది. బాబుతో పాటు ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ ఆవిర్భావం తరువాత జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ సారథ్యంలో కూటమికి కర్నూలు ప్రజలు చారిత్రాత్మక విజయం అందించారు. ఓర్వకల్లు పారిశ్రామివాడ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2,786 కోట్లు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం మినహా జిల్లాలో చెప్పుకోదగ్గ అభివృద్ధి వైపు అడుగులు పడలేదు. ఉద్యోగుల బదిలీలు, రాజకీయ సర్దుబాట్లతో వంద రోజులు గడిచిపోయాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అభివృద్ధి వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత లోకేశ్ పాదయాత్ర సందర్భంగా, జిల్లా పర్యటనలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు పలు హామీలు ఇచ్చారు. అదే క్రమంలో ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులుగా ఎమ్మెల్యేలు కూడా పలు హామీలు ఇచ్చారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలి. ఆ ప్రణాళిక అమలు దిశగా అడుగులు వేయాలి.

టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సాధించిన భారీ విజయం ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధికి రూ.2,786 కోట్లు కేటాయిస్తూ కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపడం. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వెయ్యి మెగా వాట్ల సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి యూనిట్ 3,500 మెగావాట్లతో నిర్మాణానికి నాంది పలికారు. 1,010 ఎకరాల విస్తీర్ణంలో.. రూ.110 కోట్లతో కర్నూలు(ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించారు. 2019లో జగన్ ప్రభుత్వం రాకతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పురోగతి అటకెక్కింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ప్రగతి అడుగులు పడ్డాయి.

ఆయా నియోజకవర్గాల్లో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేపట్టలేదు. మంత్రి టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి సహా ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, డాక్టర్ పార్థసారథి, కేఈ శ్యాంబాబు, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్తా జయసూర్య సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు.. వంటి చిన్నచిన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనాలు చేయడం మినహా భారీ ప్రాజెక్టుల వైపు అడుగులు వేయలేదని తెలుస్తుంది. వివిధ శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన శాశ్వత అభివృద్ధి పనులపై శాఖల వారిగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ప్రణాళికలతో సరిపుచ్చకుండా వాటి అమలుపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రూ.2,786 కోట్లతో ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధి!

ఆగస్టు 28న నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎన్ఐసీడీపీ)లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో.. రూ.2,786 కోట్లతో అభివృద్ధికి కేంద్రం ఆమోద ముద్ర వేసింది. రూ.12 వేల కోట్లు పెట్టుబడులు.. 45,071 మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన అతిపెద్ద విజయం ఇది. ఇది మినహా



టీడీపీ కూటమి చారిత్రాత్మక విజయం

టీడీపీ ఆవిర్భావం తరువాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని టీడీపీ సారథ్యంలోని టీడీపీ కూటమి సాధించిన చారిత్రాత్మక విజయం అందుకుంది. ఉమ్మడి జిల్లాలో 13 అసెంబ్లీ స్థానాలకు గాను 1983లో జరిగిన ఎన్నికల్లో ఆనాడు ఎన్టీఆర్ ప్రభజనంలోనూ ఆరు అసెంబ్లీలోనే విజయం సాధించారు. ఆ తరువాత ఎన్టీఆర్ ప్రభుత్వం భర్తరఫ్ చేయడంతో 1985లో జరిగిన ఎన్నికల్లో 8 స్థానాల్లో టీడీపీ గెలిచింది. 1989లో 4 స్థానాలతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. 1994లో జరిగిన ఎన్నికల్లో 8 స్థానాలు, 1999లో నాటి సీఎం చంద్రబాబు సారథ్యంలో జరిగిన ఎన్నికల్లో 10 స్థానాల్లో విజయం దక్కించుకున్నారు. 2004 ఎన్నికల్లో ఆనాటి పీసీసీ అధ్యక్షుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర ప్రభంజనం వల్ల కేవలం ఒకే ఒక స్థానాని (పత్తికొండ)కే పరిమితమైంది. 2009లో నాలుగు స్థానాలు దక్కించుకుంటే.. రాష్ట్ర విభజన తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో కేవలం 3 స్థానాల(పత్తికొండ, ఎమ్మిగనూరు, బనగానపల్లె)తో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. 2019 ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలవలేదు. 1999 ఎన్నికల్లో మినహా టీడీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. టీడీపీ ఆవిర్భావం తరువాత 42 ఏళ్లలో 10 పర్యాయాలు ఎన్నికలు జరిగితే.. తొలిసారిగా కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలతో పాటు 12 అసెంబ్లీ స్థానాల్లో చారిత్రక విజయం అందుకుంది.





ఎమ్మెల్యేలు వీటిపై దృష్టి సారించాలి..!



- నంద్యాల పట్టణానికి వెలుగోడు జలాశయం నుంచి తాగునీరు అందించే లక్ష్యంగా అమృత్-2 కింద రూ.112 కోట్లతో చేపట్టి పైపులైన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఎస్ఆర్‌బీసీ కాలనీ, వైఎస్ఆర్ నగర్‌కు వెళ్లేందుకు కుందూ నదిపై బ్రిడ్జి, రక్షణ గోడ నిర్మించాల్సి ఉంది. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వీటిపై ప్రధానంగా దృష్టి పెట్టాలి.
- బనగానపల్లె రింగ్ రోడ్డు రూ.50 కోట్లు, కృష్ణగిరి నుంచి మండంపేట తండాకు రూ.12 కోట్లతో బీటీ రోడ్డు నిర్మిస్తానని ఎన్నికల ముందు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు.
- శ్రీశైలం నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ఫీల్డ్ ఛానల్స్, మట్టికట్ట బలోపేతం పనులకు రూ.50 కోట్లు కావాలి. ఆత్మకూరు పట్టణానికి వెలుగోడు జలాశయం నుంచి తాగునీరు అందించాలని నాన్ అమృత్ కింద రూ.119 కోట్లతో చేపట్టిన పైపులైన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. శ్రీశైలం మాస్టర్ ప్లాన్‌పై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రధానంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
- నందికొట్కూరు పట్టణానికి అలగనూరు రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించే నీటి పథకానికి గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.120 కోట్లతో శంకుస్థాపన చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ప్రాజెక్టును అటకెక్కించారు. హంద్రీనీవా కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా సాగునీరు ఇవ్వాలని మిడుతూరు మండలం రైతులు డిమాండ్ చేస్తున్నారు. వీటి సాధన కోసం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గట్టిగా పని చేయాల్సి ఉంది.

అవ్వా తాతలకు భరోసా కల్పించారు



ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతు మహిళలకు సామాజిక భద్రత పింఛన్లు పెంచారు. వృద్ధుల పింఛన్ రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారుగా 4.56 లక్షల మంది పింఛనుదారులకు టీడీపీ కూటమి ప్రభుత్వం రెట్టింపు భరోసా కల్పించింది. కర్నూలు జిల్లాలో 2,45,229 మంది పింఛన్‌దారులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నెలకు రూ.68-70 కోట్లు పింఛన్ చెల్లిస్తే.. టీడీపీ కూటమి వచ్చాక రూ.102 కోట్లకు పైగా చెల్లిస్తున్నారు. అంటే రూ.32 కోట్లకు పైగా అదనపు లబ్ధి చేకూరింది. ఉమ్మడి జిల్లాలో రూ.65-70 కోట్లు అదనపు ఆర్థిక ప్రయోజనం లభించిందని డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే అన్న క్యాంటీన్లు ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ 18-49 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 చేయుత అందించే పథకానికి బుధవారం మంత్రివర్గం ఆమోదిస్తూ తీపి కబురు అందించింది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి బలవన్మరణం

- ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్ కంపెనీ మోసం
- సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య



సయ్యద్ ఖలీల్ అహమ్మద్ (ఫైల్)

నంద్యాల క్రైం, సెప్టెంబరు 18 : ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌కు సంబంధించిన ఓ కంపెనీ మోసం చేయడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ వివరాల మేరకు.. నంద్యాల పట్టణంలోని సలీం నగర్‌కు చెందిన సయ్యద్ ఖలీల్ అహమ్మద్ అవుకు మండలం సంగపట్నం జడ్పీహెచ్ పాఠశాలలో హిందీ పండిట్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆగస్టులో ఆన్‌లైన్ యాప్‌కు సంబంధించిన టైటన్ ఎఫ్ ఎక్స్ డాట్ వీకే కంపెనీ నుంచి తనకు ఫోన్ వచ్చింది. తన కంపెనీలో పెట్టుబడిపెడితే పది శాతం కమీషన్‌తో మంచి లాభాలు వస్తాయని నమ్మబలికారు. కమీషన్‌తోపాటు బోనస్ కూడా ఇస్తామని చెప్పడంతో ఖలీల్ అహమ్మద్ తన భార్య పేరుమీద ఆ కంపెనీలో ఖాతాను ఓపెన్ చేశారు. కంపెనీలో లాభాలు గడించిన ఇతర ఖాతాదారుల వివరాలు ఖలీల్‌కు చూపించడంతో నిజమేనని నమ్మి రూ.1.50 లక్షల నగదును డిపాజిట్ చేశారు. ఖలీల్ డిపాజిట్‌కు రూ.7 లక్షలు కమీషన్ వచ్చిందని, ఆ కమీషన్‌ను డ్రా చేసుకోవాలంటే రూ.50 వేలు జమ చేయాలని చెప్పారు. దీంతో సెప్టెంబరు 5న రూ.50 వేలు వారి ఖాతాలో జమ చేశారు. ఐటీ, జీఎస్టీ తదితర పన్నులు కడితేనే పూర్తి మొత్తంలో నగదు వస్తుందని చెప్పడంతో విడతలవారీగా సెప్టెంబరు 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రూ.8.50 లక్షలు వారి ఖాతాకు జమ చేశారు. చివరకు కంపెనీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గుర్తించారు. దీనికితోపాటు నూతనంగా ఇంటిని నిర్మించుకోవడంతో వచ్చే జీతం బ్యాంకు లోన్‌కే సరిపోతోంది. దీంతో చేతిలో డబ్బులేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. ఎవరికి చెప్పుకోలేక అర్ధంగాక మంగళవారం రాత్రి సెల్ఫీ వీడియోలో తాను మోసపోయిన ఉదంతాన్ని చెప్పి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిల్లల సంరక్షణపై శ్రద్ధ తీసుకోండి: కలెక్టర్



బాలల సంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 18: శిశు గృహంలోని పిల్లల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి స్త్రీ శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పొన్నాపురం కాలనీలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక దత్తత కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ శిశు కేంద్రంలో పిల్లలను ప్రేమతో, కుటుంబ వాతావరణంలో పెంచాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్, శిశు గృహ కేంద్రాలను పరిశీలించి పిల్లలకు కల్పిస్తున్న వసతుల గురించి కార్యాలయం సూపరింటెండెంట్ శమంతకమణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి స్వప్న ప్రియదర్శినిలను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు బదిలీ

కల్లూరు, సెప్టెంబరు 18: జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావును బదిలీ చేస్తూ రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీహెచ్ నాగలింగేశ్వరరావును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేయగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. త్వరలో మరొకరిని జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ వి.చెన్నకేశవరెడ్డిని కర్నూలు జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.ఉమాదేవిని ఆనకా పల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా నియ మిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

డీఐజీ పీజీఎస్ కళ్యాణి కొనసాగింపు: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పీజీఎస్ కళ్యాణిని కర్నూలులోనే కొనసాగిస్తూ ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

నితిన్ గడ్కరీని కలిసిన మంత్రి బీసీ



నితిన్ గడ్కరీని కలిసిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, పౌర విమానయాన మంత్రి కే రామ్మోహన్ నాయుడు

నంద్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం డిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రోడ్ల పరిస్థితిని గడ్కరీకి వివరించి సమస్యలపై చర్చించారు. సీఆర్ఐఎఫ్ పథకం కింద అభివృద్ధి చేయటానికి రాష్ట్ర రోడ్ల జాబితాను సమర్పించి, వాటికి కావాల్సిన రూ.133 కోట్ల నిధులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేయాలని కోరారు. ఎన్‌డీబీ నిధులను రూ.350 కోట్ల నుంచి రూ.500 కోట్లకు పెంచాలని, 31 రాష్ట్ర రహదారులను ప్రాధాన్యత క్రమంలో జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేసి వాటికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఓ కమిటీ ఏర్పాటు చేసిందని, ప్రతి పదిహేను రోజులకోసారి సమస్యలపై చర్చిస్తూ, రోడ్డు ప్రాజెక్టులకు సంబంధించిన అభివృద్ధిని ఎప్పటికప్పుడు తెలియజేస్తామని గడ్కరీకి తెలియజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరి రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయిస్తామంటూ హామీ ఇచ్చారని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు.



శివతాండవం..!

ధర్మపథంలో ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన

శ్రీశైలం, సెప్టెంబరు 18: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిత్యకళారాధనలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కిన్నెర కూచిపూడి నృత్య అకాడమీ బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయక ప్రార్థన, వినాయకకౌత్వం, బో..శంభో, అంబాపరాకు, శివతాండవం, ప్రణవంలో కొలువైన పరమేశ్వరి, పూజా నృత్యం తదితర శైవగీతాలకు సహస్ర, ధృతి, శ్రీనిఖ, మోక్ష, రేక్ష, రేణుజ, చైత్ర, అక్షయ, సుధ, జాబిలి తదితరులు నృత్యప్రదర్శనతో అలరించారు.



నృత్యం చేస్తున్న చిన్నారి

సింగిల్ డెస్క్ విధానంతో పరిశ్రమలకు అనుమతులు



మాట్లాడుతున్న జోనల్ మేనేజర్ సోమశేఖరరెడ్డి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 18 : ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పే వారికి సింగిల్ డెస్క్ విధానంతో అన్ని రకాల అనుమతులు మంజూరు చేయనున్నట్లు ఏపీఐఐసీ ఉమ్మడి జిల్లా జోనల్ మేనేజర్ సోమశేఖరరెడ్డి తెలిపారు. బుధవారం కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొలిమిగుండ్ల సమీపంలో ఇటిక్యాల పరిధిలో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని కోరా. నంద్యాల జిల్లా ఇటిక్యాలతో పాటు, జగదుర్తి, తంగడంచ గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మైక్రో, స్మాల్, మీడియం(ఎంఎస్ఎంఈ) ఎంటర్‌ప్రైజెస్ పట్ల యువకులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేసిన స్థలాన్ని పరిశ్రమలు నెలకొల్పే వారికి విక్రయిస్తుందని అన్నారు. అనుమతులన్నీ ఆన్‌లైన్ ద్వారానే లభిస్తాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు మాత్రం 50శాతం రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ మాధవీలత, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి, ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఏపీవో గంగన్న తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ముగిసిన కళా ఉత్సవాలు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు18: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో ప్రారంభమైన కళా ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ఈ కళా ఉత్సవాల్లో 16 నవోదయ విద్యాలయాల నుండి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రెండో రోజు 8 విద్యాలయాల విద్యార్థులు పాల్గొని తమ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారన్నారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు కేరళలోని కోజికోడ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్లు, విద్యాలయ అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

నలుగురికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు18: ఎమ్మిగనూరు మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు దాడి చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వైసీపీకి చెందిన కురువ బుడ్డ అంజినయ్య, కురువ నరసింహులుతో పాటు మరో ఎనిమిది మంది టీడీపీకి చెందిన అంజినయ్య, బోయ మోకాశి నరసింహులు, రవి, లక్ష్మీనరసమ్మ పత్తి బస్తాలను నింపుతుండగా వ్యక్తిగత కక్షతో కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ వర్గీయులకు గాయాలయ్యాయి. బాధితుడు బోయ మోకాశి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురువ బుడ్డ అంజినయ్య, కురువ నరసింహులతో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



గాయపడ్డ టీడీపీ వర్గీయుడు

ఇద్దరు యూట్యూబర్లపై కేసు నమోదు

ఆదోని, సెప్టెంబరు 18 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇద్దరు యూట్యూబ్ చానెల్ పేరుతో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారని, ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఇన్ఫెక్షన్ అయ్యే అవకాశం ఉండటం వల్ల ఆ వ్యక్తులపై ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. యూట్యూబ్ చానెల్‌కు చెందిన గౌస్, ఖాజా అనే వ్యక్తులు విధులకు ఆటంకం కలిగించడంతోపాటు బెదిరింపులకు దిగడం, ఎలాంటి అనుమతి లేకుండా ఆసుపత్రిలోకి వచ్చి రోగులను ఇబ్బందికి గురి చేసి వీడియోలు తీయడం, స్టోర్ రూమ్‌లోకి అనుమతులు లేకుండా వెళ్లి వీడియోలు తీయడం మొదలైన పనుల తో వైద్యుల విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యూట్యూబ్ నిర్వాహకులపై 353, 506, 448 ఐసీపీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామ్ తెలిపారు.

తెలుగుగంగ 28వ బ్లాక్ చానెల్‌లో పడి చిన్నారి మృతి

రుద్రవరం, సెప్టెంబరు 18 : తెలుగుగంగ 28వ బ్లాక్ చానెల్‌లో పడి బుధవారం ఓ చిన్నారి మృతి చెందింది. ఆలమూరు తిప్ప గ్రామానికి చెందిన కమాల్‌బీ - రఫి దంపతుల రెండో కుమార్తె షేక్ రజియా స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. పాఠశాల వదిలిన తరువాత సాయంత్రం ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు గంగ 28వ బ్లాక్ చానెలో పడింది. తోటి చిన్నారులు స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు రజియాను వెలికితీసి ఓ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని చెప్పారు. రఫి గడేకారి పనికి, తల్లి కమాల్‌బీ పొలం పనులకు వెళ్లారు. బిడ్డ మృతి చెందిన విషయం తెలుసుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు.



షేక్ రజియా మృతదేహం

- ఆలమూరు తిప్ప గ్రామానికి ఓ వైపు రోడ్డు, మరో వైపు తెలుగుంగ 28వ బ్లాక్ చానెల్ ఉన్నాయి. గ్రామం నుంచి విద్యార్థులు ఆలమూరుకు కాలిబాటన వెళ్లి చదువుకుంటున్నారు. గంగ కాల్వ రహదారి పక్కనే ఉండడంతో ప్రమాదాలు జరగకుండా కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కేసీ ఉప కాల్వలో పడి బాలుడు..

శిరివెళ్ల, సెప్టెంబరు 18 : శిరివెళ్ల మెట్ట సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద ఉన్న కేసీ ఉప కాల్వలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. శిరివెళ్ల మెట్ట వద్ద ఉన్న బుడగ జంగాల కాలనీకి చెందిన గురుమూర్తి కుమారుడు శంకరయ్య మంగళవారం మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు కేసీ ఉప కాల్వలో పడిపోయాడు. కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించారు. అనంతరం శంకరయ్య మృతదేహాన్ని బుధవారం ఉదయం కేసీ ఉప కాల్వలో గుర్తించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు భోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేరించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పాములపాడు, సెప్టెంబరు 18: గత నాలుగు సంవత్సరాలుగా పంటలు సరిగా పండక అప్పులపాలై జీవితంపై విరక్తి చెంది మూల రమణయ్య (75) అనే రైతు వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని వేంపెంట గ్రామంలో జరిగింది. రమణయ్య నాలుగేళ్లుగా తన సొంత పొలం నాలుగు ఎకరాలతో పాటు మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని మిరప, మొక్కజొన్న పంటలను సాగు చేశాడు. వరుసగా వర్షాభావం వల్ల పంటలు రాక నష్టపోయాడు. కాస్తో, కూస్తో పండిన పంటలకు గిట్టుబాటు ధరలు రాలేదు. దీంతో దాదాపు 20 లక్షల మేర అప్పులు మిగిలాయి. రుణబారంతో తీవ్ర మనస్తాపానికి గురై గ్రామానికి సమీపంలో నిప్పులవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం బండి ఆత్మకూరు సమీపంలో కుందూ నదిలో శవం కనిపించింది. స్థానిక ఎస్ఐ జగన్‌మోహన్ మృతదేహాన్ని పంచనామాకు తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు లెనిన్‌బాబు, జయశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మూల రమణయ్య (ఫైల్)

ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- జీపీఎస్ ద్వారా అడ్డుకుంటాం
- జిల్లాలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రెండు నెలల్లో 70 కేసులు.. రూ.33 లక్షల అపరాధ రుసుం వసూలు
- నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం
- ఆంధ్రజ్యోతితో మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్

కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్ ఆంధ్రజ్యోతితో అన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేస్తున్నామని, ఇసుక రవాణా చేసే టిప్పర్లు, ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేసి అక్రమ రవాణాను నిరోధిస్తామని అన్నారు. వాహనాలు సీజ్ చేయడమే కాకుండా బ్లాక్ లిస్టులో పెడుతామని అన్నారు. నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌కు శ్రీకారం చుడుతున్నామని, గ్రామ, వార్డు సచివాయాల్లో కూడా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చని ఆయన బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆ వివరాలు ఇలా..



- **ఆంధ్రజ్యోతి:** ఇసుక అక్రమ రవాణాను కరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు వివరిస్తారా..?
- **డీడీ రాజశేఖర్:** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీలకే అందించే లక్ష్యంగా కలెక్టరు పి. రంజిత్ బాషా ఆదేశాలతో మైనింగ్, రెవెన్యూ, పోలీస్, రవాణా, ఇరిగేషన్ శాఖల అధికారులతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలను జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడ ఫిర్యాదు వచ్చినా తక్షణం స్పందిస్తాం. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లు, టిప్పర్లకు జీపీఎస్ ఏర్పాటు చేస్తాం. తద్వారా అక్రమ రవాణాకు కళ్లెం వేస్తాం. ప్రభుత్వం థర్డ్ పార్టీ నిఘా పెట్టింది.
- జిల్లాలో ఎన్ని రీచ్‌లకు అనుమతి ఇచ్చారు. టీడీపీ కూటమి వచ్చాక ఎంత ఇసుకను వినియోదారులకు అందించారు?
- **డీడీ:** తుంగభద్ర నదిలో డీసిల్టేషన్ (బోట్ల ద్వారా ఇసుక తవ్వకం) రీచ్‌లు సి. బెళగల్ మండలం కె. సింగవరం, కొత్తకోట, ముడుమాల, ఈర్లదిన్నె, పల్లెదొడ్డి రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఉన్నాయి. ఈ రీచ్‌ల్లో ఇప్పటి వరకు 65 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేసి వినియోగదారులకు అందించాం. కౌతాళం మండలం మరళి, గుడికంబాలి, నదిచాగి గ్రామాల తుంగభద్రలో ఓపన్ ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేశాం.
- ఆన్‌లైన్ బుకింగ్ ఎలా చేసుకోవాలి. బుకింగ్ చేసుకున్న తరువాత ఎన్ని రోజులకు ఇసుక ఇస్తారు..?
- **డీడీ:** జిల్లాలో గ్రామ, వార్డు సచివాయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు. ఆమేరకు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో కాకుండా బయట కూడా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ చేసుకున్న మరుసటి రోజు (24 గంటలు తరువాత) రీచ్‌ల్లో ఇసుక ఇస్తారు. ఏ రీచ్‌లో ఎంత ఇసుక అందుబాటులో ఉందో ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. నేటి నుంచి ఆన్‌లైన్ బుకింగ్‌కు శ్రీకారం చుడుతున్నాం. అందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశాం.
- టిప్పరు యజమానులు సిండికేట్‌గా ఏర్పడి అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీనిని ఎలా నిరోధిస్తారు..?
- **డీడీ:** రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుంది. రాయల్టీ, లోడింగ్ చార్జీ, రవాణా చార్జీలు మాత్రం వినియోగదారులు చెల్లించాలి. జీవో నంబరు 52 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం రవాణా చార్జీలు నిర్ణయించారు. ఆ చార్జీలకు మించి వసులు చేస్తే నేరం అవుతుంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి వాస్తవమని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. వాహనాలు సీజ్ చేసి బ్లాక్ లిస్టులో పెట్టి ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వం. ఈ విషయంలో ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉంది. దీనిపై వినియోగదారులు కూడా అవగాహన పెంచుకోవాలి. అధికంగా అమ్మకాలు చేస్తే టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు లేదా రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా తక్షణమే స్పందిస్తాం.
- ఉమ్మడి జిల్లాలో ఈ రెండు నెలల్లో అక్రమ మైనింగ్‌పై ఎన్ని దాడులు చేశారు..? ఎంత అపరాధ రుసుం వసులు చేశారు..?
- **డీడీ:** ఉమ్మడి జిల్లాలో ఇసుక, ఎర్రమట్టి, రోడ్ మెటల్ (కంకర), నాపరాయి.. వంటి అక్రమ మైనింగ్, రవాణాపై వచ్చిన ఫిర్యాదులు ఆధారంగా, ఆకస్మిక తనిఖీలు చేశాం. ఆగస్టు నెలలో 50 కేసులు నమోదు చేసి అక్రమార్కుల నుంచి రూ.19 లక్షలు, ఈ సెప్టెంబరు నెలలో ఇప్పటి వరకు 20 కేసులు నమోదు చేసి రూ.14.23 లక్షలు అపరాధ రుసుం వసులు చేశాం. ఎక్కడైనా అక్రమ మైనింగ్ జరుగుతుంటే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

వైభవంగా సీమోల్లంఘన ఉత్సవం

- 48 రోజుల దీక్షను ముగించిన సుబుదేంద్రతీర్థులు
- పీఠాధిపతికి నాణేలతో తులాభారం

మంత్రాలయం, సెప్టెంబరు 18: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు సీమోల్లంఘన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి కొండాపురం ఆంజనేయస్వామిని దర్శించుకొని పంచ అశ్వవాహన రథంపై పీఠాధిపతి ఊరేగారు. గత నెల 2వ తేదీ నుంచి సెప్టెంబరు 18 వరకు 48 రోజుల పాటు మంత్రాలయం సరిహద్దులు దాటకుండా చాతుర్మాసదీక్షను పీఠాధిపతి కొనసాగించారు. దీక్ష విరమణలో భాగంగా శ్రీమఠం ఎంప్లాయిస్ యూనియన్, విజయ విఠల షాపింగ్ కాంప్లెక్స్, వీఎంపీఆర్ షాపింగ్ కాంప్లెక్స్, నదితీరం షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించినవారు పీఠాధిపతికి పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు.



పీఠాధిపతికి పుష్పాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

పీఠాధిపతికి నాణేలతో తులాభారం

సీమోల్లంఘనలో భాగంగా శ్రీమఠం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రవికులకర్ణి, ఐపి నరసింహమూర్తి, అనంతపురాణిక్, జేపీ స్వామి, విజేంద్రాచార్ పీఠాధిపతులకు నాణేలతో తులాభారం చేశారు. బుధవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో ప్రత్యేక వేదికపై తులాభారంలో ఒక వైపు పీఠాధిపతిని ఉంచి, మరో వైపు నాణేలతో తూగించారు. అనంతరం పుష్పాభిషేకం చేసి పట్టువస్త్రం కట్టి, 50 గ్రాముల బంగారు బిళ్లను బహూకరించారు. 48 రోజుల దీక్షల్లో 60 ఉపన్యాసాలు, 20 సంగీత కచేరీలు విజయవంతంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో టీటీడీ దాససాహిత్య భజన మండళ్లు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, రాజాఎస్ అప్రమేయాచార్, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ఐపి నరసింహమూర్తి, బీఎం ఆనందరావు, అనంతపురాణిక్, రమణారావు, వాదిరాజాచార్, సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, హరినాథాచార్ ఉన్నారు.



పీఠాధిపతికి తులాభారంలో పాల్గొన్న ఉద్యోగులు

వీడిన అనుమానాస్పద మృతి కేసు

ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితుల అరెస్టు

ఆత్మకూరు, సెప్టెంబరు 18: అనుమానాస్పద మృతి కేసును పోలీసులు చేదించారు. బుధవారం నిందితులను అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపరిచారు. ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామాంజీనాయక్ ఆ వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన బోయ మధు సురేష్ (26) అదే గ్రామానికి చెందిన బరిగెల సంసోన్ భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఫోన్‌లో వేధించేవాడు. సంసోన్ మందలించినా అతడిలో ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో మధుసురేష్‌ను హత మార్చాలని సంసోన్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే తన సోదరుడు బరిగెల రాజేష్‌తో కలిసి ఈ ఏడాది జూలై 31 రాత్రి మధుసురేష్‌ను బైక్‌పై ఎక్కించుకున్నారు. కరివేనలోని సంసోన్ పొలానికి తీసుకెళ్లారు. అక్కడ మధుతో గొడవ పడి బండరాయితో హత్య చేశారు. అయితే నేరం బయటకు పొక్కకుండా ఉండేలా అతని మృతదేహాన్ని పాములపాడు పోలీసుస్టేషన్ పరిధిలోని భానుముక్కల శివార్లలో గల ఈదుల వాగులో పడేశారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న మధుసురేష్ ఎక్కడైనా పడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానించారు. నాలుగు రోజుల తర్వాత ఈదుల వాగులో మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా పాములపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్, పాములపాడు ఎస్ఐ సురేష్‌బాబు తనదైన శైలిలో విచారణ చేపట్టారు. ఇరువురు నిందితులు బుధవారం కరివేన వీఆర్వో శంకర్‌రెడ్డి వద్ద లొంగిపోయారు. దీంతో పోలీసులు వారిని ఆత్మకూరు కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

రికార్డు స్థాయిలో రోగులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 18: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఈ నెల 17వ తేదీ రికార్డు స్థాయిలో 3470 మంది ఓపీ రోగులు వచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలడంతో రోగుల సంఖ్య పెరిగింది. ఓపీలో పాత రోగులు 828 మంది, కొత్త రోగులు 2642 మంది వచ్చారు. వీరిలో 277 మంది ఆసుపత్రిలో వివిధ జబ్బులతో అడ్మిషన్ పొందారు. సాధారణంగా సాధారణ ఓపీ రోగులు 2500 నుంచి 3000 వరకు నమోదవుతుంటారు. కానీ సీజనల్ వ్యాధుల కారణంగా రోగుల సంఖ్య 3470కి చేరినట్లు అధికారులు వెల్లడించారు.

ఎల్లార్తి హుండీ లెక్కింపు

హొళగుంద, సెప్టెంబరు 18 : ఎల్లార్తి హజరత్ షేక్షావలి, షాషావలి సాహెబ్‌ల దర్గా హుండీ లెక్కింపును వక్ఫ్‌బోర్డు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పర్వీన్, ఈవో ఇమ్రాన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సుహైల్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలల హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే స్థానిక సర్పంచుకుగాని, ప్రజలకు గానీ కనీస సమాచారం కూడా ఇవ్వకుండా లెక్కింపు కార్యక్రమం చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దర్గాకు సంబంధించిన రెండు ఇరుకు గదుల్లో హుండీ లెక్కింపు నిర్వహించడంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సుహైల్‌ను వివరణ కోరగా పోలీసుల సమక్షంలో లెక్కింపు నిర్వహించామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గడివేముల, సెప్టెంబరు 18: చికిత్స పొందుతూ బుధవారం ఓ యువకుడు మృతి చెందాడు. మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన మనోహర్ (23) మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని తల్లి మంగమ్మ మందలించడంతో ఈ నెల 17న పురుగుల మందు తాగాడు. బంధువులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

కోడలిపై మామ దాడి

కేసు నమోదు

సంజామల, సెప్టెంబరు 18: కోడలిపై మామ దాడికి పాల్పడిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య మంగళవారం తెలిపారు. వసంతాపురం గ్రామానికి చెందిన గుంతమండ్ల శిఖామణి తన కోడలు ఉమాదేవిని దూషించి కాళ్లు, చేతులతో కొట్టి హింసించడంతో కేసు నమోదు చేశామన్నారు. ఉమాదేవి భర్త మద్దిలేటి నంద్యాల రైల్వేలో పని చేస్తున్నాడని, వారానికి ఒకసారి వచ్చిపోతూ వసంతాపురం గ్రామంలోనే కాపురం పెట్టాడని తెలిపారు. ఈ నేపథ్యం మామ తరచూ ఉమాదేవిని అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఇనుప కడ్డీల కోసం వెళ్లి కేసీలో గల్లంతు

కర్నూలు, సెప్టెంబరు 18: వినాయక నిమజ్జనం సందర్భంగా విగ్రహాలకు ఉండే ఇనుప కడ్డీలను తెచ్చుకునేందుకు వెళ్లి భీముడు (40) అనే వ్యక్తి కేసీలో గల్లంతయ్యాడు. బిర్లా గడ్డకు చెందిన భీముడు సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఈ నెల 16న కేసీ కెనాల్‌లో ఉన్న వినాయక విగ్రహాలకు ఉన్న కడ్డీలను తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పాడు. ఆ తర్వాత ఇంటికి రాలేదు. బుధవారం సాయంత్రం జొహరాపురం బ్రిడ్జి సమీపంలో నీటిలో శవమై తేలుతూ కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మూడో పట్టణ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

పర్సు కత్తిరించి నగదు చోరీ

కర్నూలు, సెప్టెంబరు 18: ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం క్యూలైన్‌లో నిల్చుండగానే పర్సులోని నగదును ఓ కిలాడి లేడీ అపహరించింది. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. బుధవారపేటకు చెందిన జయమ్మ అనే మహిళ ఆధార్ అప్‌డేట్ కోసం పోస్టాఫీసుకు వెళ్లింది. లైన్‌లో నిల్చుండగా.. ఓ యువతి తాను కూడా అప్‌డేట్ కోసం వచ్చానని లైన్‌లో నిల్చోవాలని అటు ఇటూ తిరిగింది. కొద్దిసేపటి తర్వాత జయమ్మ పర్సు మొత్తం కత్తిరించింది. అందులో ఉన్న రూ.8వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సీసీ కెమెరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల్లో అక్కడకు వచ్చి అంతసేపు తిరుగుతున్న ఆ యువతే ఈ నగదును తస్కరించినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ వెంకటరమణకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 18: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏఆర్ఎంవోగా పని చేస్తున్న డా. టీసీహెచ్ వెంకటరమణ డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డా.కే. పద్మావతి, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉన్న ఆయనకు కౌన్సెలింగ్‌లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు మెడికల్ కాలేజీ ఎస్‌పీఎం డిపార్టుమెంటులో పోస్టింగ్ వేశారు. పదోన్నతి పొందిన ఆయన 15 రోజుల్లో విధుల్లో చేయాలని డైరెక్టర్ ఆదేశించారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆయనను రిలీవ్ చేయగా.. బుధవారం మధ్యాహ్నం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మకు రిపోర్టు చేశారు. అనంతరం విధుల్లో చేరారు.



కారు బోల్తా : పదిమందికి గాయాలు



బోల్తా పడిన కారు

వెల్దుర్తి, సెప్టెంబరు, 18: మండలంలో మదార్‌పురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి-44 పై ఇన్నోవా కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పది మందికి తీవ్రగాయాల య్యాయి. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి (తారకరామ నగర్) చెందిన మంగలి పరమేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం క్రిష్ణగిరి మండలం పుట్లూరు మారెమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. పూజా కార్యక్రమాల అనంతరం వారు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో వెల్దుర్తి దాటిన తరువాత మదార్‌పురం సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో టైరు పగిలిపోయి పల్టీలు కొట్టుకుంటూ ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఎడమ పక్కన ఉన్న సర్వీసు రోడ్డుపై బోల్తా పడింది. గ్రామస్తులు, అటుగా వెళుతున్న వారు కారులో ఇరుక్కున వారిని అతికష్టం మీద బయటకు తీసుకువచ్చారు. హైవే పోలీసులు, స్థానిక పోలీసులు అక్కడకు చేరుకొని క్షతగాత్రులను హైవే అంబులెన్స్ 108 వాహనంలో వెల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. మోక్షిత్, వెంకటేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

క్షతగాత్రులు వీరే... మంగలి రాఘవేంద్ర (డ్రైవర్), మంగలి పరమేష్, రామలింగం, వెంకటేశ్వరమ్మ, పార్వతమ్మ, మౌనిక, మోక్షిత్, జ్యోతి కారు ప్రయాణంలో గాయపడ్డారు. కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన శంకర్, ప్యాపిలి మండలం చిన్నపూజర్లకు చెందిన ప్రవీణ్ బైక్‌పై వెళ్తూ కారు వెనుక నుండి ఢీకొనడంతో గాయపడ్డారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మహానందిలో పశుసంవర్ధక శాఖ డీడీ పూజలు

మహానంది, సెప్టెంబరు 18: మహానంది ఆలయంలో బుధవారం పశు సంవర్ధక శాఖ నంద్యాల జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖ ద్వారం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాచమల్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు బెక్కెం శరభయ్యశర్మ, ఎంఎల్‌వో సులోచన, సంజీవ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

నందికొట్కూరు, సెప్టెంబరు 18: పరిసరాల పరిశుభ్రతే మనందరి ఆరోగ్యమని నందికొట్కూరు డిపో మేనేజర్ నాగేశ్వర రావు అన్నారు. బుధవారం స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాల్లో భాగంగా రెండవ రోజు నందికొట్కూరు డిపో మేనేజర్ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో నందికొట్కూరు బస్టాండ్, గ్యారేజీ పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరి ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భాద్రపద పౌర్ణమి హోమాలు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 18: నంద్యాల హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమ్మ స్ఫటిక లింగేశ్వరాలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో భాద్రపద మాస పౌర్ణమి హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు యోగానంద ఆధ్వర్యంలో ఉదయం అమ్మ స్ఫటికలింగేశ్వర స్వామి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో యోగా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి

కొత్తపల్లి, సెప్టెంబరు 18: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలపై ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని ఆత్మకూరు వ్యవసాయ సంచాలకులు అంజనేయులు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక మండల వ్యవసాయాధికారి మహేష్‌తో కలిసి మండలంలోని కొక్కెరంచ రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్త అరెస్ట్

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 18: భార్య మృతికి కారణమైన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ఆత్మకూరు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో డీఎస్పీ రామాంజినాయక్, శ్రీశైలం వన్‌టౌన్ సీఐ వరప్రసాదరావు వివరాలను వెల్లడించారు. శ్రీశైలం మండలానికి చెందిన సున్నం మధులత, బైసాని కార్తీక్ తొమ్మిది సంవత్సరాలు ప్రేమించుకున్నారు. ఈ నెల 9వ తేదీన శ్రీశైలంలోని పాతాళగంగ రోడ్‌లో అంజనేయ స్వామి గుడిలో వివాహం చేసుకున్నారు. అయితే ఇరు కుటుంబాల మధ్య విభేదాలు రావడంతో బైసాని కార్తీక్ తన భార్యను సూటిపోటి మాటలతో వేధించేవాడు. దాంతో మనస్థాపం చెందిన మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక ఈ నెల 10న మృతి చెందినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ మేరకు మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీశైలం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడిని ఈనెల 18న అరెస్ట్ చేసి, ఆత్మకూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

మరమ్మతులకు నోచుకోని వాటర్ ప్లాంట్లు

- మూడు నెలలుగా పట్టించుకోని అధికారులు
- తాగునీటి కోసం గ్రామస్థుల ఇబ్బంది




తూర్పు, పడమర నెహ్రూనగర్ గ్రామాల్లో మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్లు

పగిడ్యాల, సెప్టెంబరు 18: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేసేందుకు ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. వాటర్ ప్లాంట్లు మూడునెలలుగా మరమ్మతులకు గురైన పంచాయతీ, తాగునీటి సరఫరా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని తూర్పు, పడమర నెహ్రూనగర్ గ్రామాల్లో 2022లో ఆర్‌డబ్ల్యూస్ అధికారులు రూ.ఐదు లక్షల ఎంపీపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌లను నిర్మించారు. స్వచ్ఛమైన తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఊరిలోనే ఉచితంగా నీరు దొరుకుతుందని సంబరపడ్డారు. అయితే పాంట్లు ప్రారంభించి రెండేళ్లు దాటిపోయిన నిర్వాహణను గ్రామ పంచాయతీ అధికారులకు అప్పగించలేదు. మరమ్మతులకు గురైనప్పుడు ఆర్‌డబ్ల్యూస్ అధికారులు చేయించేవారు. అయితే మూడు నెలల క్రితం ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్లాంట్లు మూతపడ్డాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ప్రైవేట్ ప్లాంట్లను ఆశ్రయించడంతోపాటు చుట్టు పక్కల గ్రామాలైన ముచ్చుమర్రి, కొణిదేలకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అయినా తప్పని పరిస్థితుల్లో గ్రామంలోని కుళాయిలు, ట్యాంకుల నీటిని తాగాల్సిన పరిస్థితి తలెత్తుతుందని ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్ల చుట్టు పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు విలువైన సామగ్రి దెబ్బతింటుందని పలువురు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీలకు అప్పగించలేదు



గ్రామంలో మినరల్ వాటర్ ప్లాట్లను నిర్మించి రెండేళ్ల గడిచినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామ పంచాయతీలకు అప్పగించలేదు. ప్లాంట్‌లోని పలు అంశాలతో కూడిన పత్రాన్ని పంచాయతీ అధికారులకు అందజేసే ఎలాంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం. తాము ఏమి చేయలేమని, సమస్యను సంబంధిత అధికారులే పరిష్కరించాలన్నారు.

- వీరన్న యాదవ్, పంచాయతీ కార్యదర్శి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల క్రైం, సెప్టెంబరు 18 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు హెచ్చరించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల పోలీస్ సైబర్ సెక్యూరిటీ విభాగం, టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, హ్యూమన్ ట్రాఫికింగ్, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడానికి ఫేక్ లోన్ యాప్‌ల ద్వారా, సామాజిక మాధ్యమాలలో లింక్‌లను పంపి ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని నమ్మిస్తున్న వైనాన్ని వివరించారు. ఆన్‌లైన్‌లో జాబ్స్ అంటూ, వర్క్‌ఫ్రం హోం అంటూ ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చంటూ వివిధ రకాలుగా మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇలాంటి వాటిపట్ల జాగ్రత్తగా ఉంటూ మీ చుట్టుపక్కల వారికి కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచనకు వెళ్లి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. తెలియని వ్యక్తులకు ఎలాంటి పరిస్థితుల్లోనూ మీ బ్యాంక్, ఓటీపీ, సీసీవీ నెంబర్స్, పాస్‌వర్డ్ తెలియజేయవద్దని సూచించారు. సమావేశంలో రామకృష్ణ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రావు, సైబర్ సెల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు



బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబు

ఆత్మకూరు, సెప్టెంబరు 18: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా ఎల్. రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్ అధికారుల బదిలీల్లో భాగంగా బేతంచెర్ల ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎల్.రమేష్‌బాబును ఆత్మకూరుకు బదిలీ చేశారు. అదే విధంగా ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హరిప్రసాద్‌ను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రిపోర్టు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ రిలీవ్ కాగా ఆయన స్థానంలో నూతన కమిషనర్‌గా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియాను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అదేవిధంగా వార్డు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది కమిషనర్ రమేష్ బాబును మర్యాదపూర్వంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

22న ఏపీటీఎఫ్ 80వ వసంతాల వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న నగిరి శ్రీనివాసులు

గడివేముల, సెప్టెంబరు 18: నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 22న నిర్వహించనున్న ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి కోరారు. బుధవారం మండలంలోని గడిగరేవులలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడారు. 80వ వసంతాల వేడుకలకు మేధావులు, ప్రజా ప్రతినిధులు హాజరై ఉపాధ్యాయుల సమస్యలపై, సమకాలిన అంశాలపై చర్చిస్తారని అన్నారు. ఉపాధ్యాయులు ఈ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా మహిళా కార్యదర్శి కవిత, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముసలిమడుగు ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

కొత్తపల్లి, సెప్టెంబరు 18: మండలం ముసలిమడుగు గ్రామ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ దాసుపై నంద్యాల జిల్లా ఎన్‌ఆర్‌ఈజీఎస్ అంబుడ్స్‌పర్సన్ సురేంద్రనాథ్ విచారణ చేపట్టారు. బుధవారం ముసలిమడుగు గ్రామ సచివాలయంలో సురేంద్రనాథ్‌తో పాటు ఎంపీడీవో మేరీలు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అంబుడ్స్ పర్సన్ సురేంద్రనాథ్ మాట్లాడుతూ ముసలిమడుగులో ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దాసు గ్రామంలోని ఓ వర్గానికి చెందిన వారికే హార్టికల్చర్ కింద లబ్ధి చేకూర్చినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. అంతేగాకుండా ఇటీవల స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు చేపట్టిన బహిరంగ విచారణలో గ్రామానికి చెందిన సుబ్బన్న, శ్రీనివాసులు, పుల్లయ్యతో పాటు మరికొందరు ఫీల్డ్ అసిస్టెంట్ దాసుపై ఫిర్యాదు చేశారన్నారు. పీడీ ఆదేశాల మేరకు తాము విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణలో ఇరువర్గాల వాదనలు విని రికార్డు చేసుకుని పీడీకి నివేదిస్తామన్నారు. ఆ నివేదిక ఆధారంగా పీడీ చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో ఏపీవో రేష్మా, స్థానిక సర్పంచ్ జమీలాబీ, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారిస్తున్న సురేంద్రనాథ్

సాంకేతికత సమాజ హితం కోరాలి

- ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఎండీ మిద్దె శివరామ్

పాణ్యం, సెప్టెంబరు 18 : సాంకేతికత సమాజ హితం కోరాలని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఎండీ మిద్దె శివరామ్ పేర్కొన్నారు. సీఎస్‌ఈ డీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గూగుల్ డెవలప్ గ్రూప్స్ సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూగుల్ డెవలపర్ గ్రూప్స్‌కు ఆర్జీఎం సీఎస్‌ఈ విద్యార్థిని సాయిలక్ష్మి ఎంపిక కావడం హర్షించ దగ్గ విషయమన్నారు. నేటి సాంకేతిక విద్యార్థులు కొత్త విధానాలు కని పెట్టడంలో నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పద్ధతులే కొనసాగించడం విచారకరమన్నారు. దశాబ్దాల క్రితం కనిపెట్టిన కొత్త ప్రయోగాలను మరింత మెరుగుపరచడానికి ఇంజనీరింగ్ విద్యార్థులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ప్రయోగాలు గూగుల్ ద్వారా ప్రపంచానికి తెలుస్తుందన్నారు. సైబర్ నేరాలలో అధిక శాతం ఇంజనీరింగ్ విద్యార్థులే ఉండడంపై విచారం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డీన్ డాక్టర్ రామిరెడ్డి, హెచ్‌ఓడి భాస్కరరావు, పారిశ్రామిక నిపుణులు బెంగుళూరు ఎన్నోవేషన్ కంపెనీ సీఈఓ డాక్టర్ మధుకుమార్‌శ్రీనివాస్, ఆష్పాక్ షేక్, వంశీనందన్ విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిరాంలో వర్క్‌షాప్ : శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సిస్కో ప్యాకెట్ ట్రేసర్‌పై ప్రయోగాత్మక వర్క్‌షాప్ నిర్వహించారు. ఐఈఈఈ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ అండ్ నెట్ వర్కింగ్ సిస్కో ప్యాకెట్ ట్రాకర్‌ను ఉపయోగించి ప్రయోగాత్మక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కమ్యూనికేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కుమార్, టాటా కమ్యూనికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజరు తమిళకుమారన్, డాక్టర్ మల్లికార్జున, వీరేష్, మహేష్‌కుమార్, అలేఖ్య, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆర్జీఎం ఎండీ శివరామ్

సాక్షి గణపతికి విశేష అభిషేకం

శ్రీశైలం, సెప్టెంబరు 18: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అలాగే మహామంగళహారతులను సమర్పించారు.

జ్వాలా వీరభద్ర స్వామికి పూజలు

శ్రీశైలం క్షేత్రంలో లోకకల్యాణంకోసం మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరభాగంలో ఉన్నటు వంటి జ్వాలా వీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాల తోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు.

టీడీపీలోకి పలువురి చేరిక

నందికొట్కూరు రూరల్ సెప్టెంబరు 18 : వైసీపీ, కాంగ్రెస్ నాయకులు టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో చేరారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర శివానంద రెడ్డి సమక్షంలో పాముల పాడు మండలం వేంపెంట టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, మోహన్‌గౌడు, బాలస్వామి ఆధ్వర్యంలో అదేగ్రామానికి చెందిన సర్పంచ్ మానిక్యమ్మతో పాటుగా వైసీపీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు టీడీపీ చేరారు. వీరికి మాండ్ర శివానంద రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, కన్వీనర్ రవీంద్రారెడ్డి వెంకటేశ్వరావు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

రేపు జాబ్‌మేళా

ఆత్మకూరు, సెప్టెంబరు 18: ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 20న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జాబ్‌మేళాకు లోకల్ యాప్, ఐసీఐసీఐ బ్యాంకు, మహేంద్ర ఫైనాన్స్, అరబిందో ఫార్మ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు మేళాకు హాజరుకావాలన్నారు.

చెంచులకు టార్పాలిన్ల పంపిణీ

పాములపాడు, సెప్టెంబరు 18: మండలంలోని వేంపెంట చెంచు కాలనీలోని 40మంది చెంచు కుటుంబాలకు టార్పాలిన్ కవర్లను శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సురేశ్‌కుమార్ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి కేజీ నాయక్, ప్రాజెక్టు మేనేజరు నాగార్జున, ఐటీడీఏ పీవోలు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాకారుల ఎంపిక పోటీలు

పాములపాడు, సెప్టెంబరు 18: మండల కేంద్రమైన పాములపాడులో ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల కో ఆర్డినేటర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈనెల 20నుంచి 21వరకు రెండు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. అండర్ 14, 17 వయస్సు గల బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, కోకో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్‌లలో పోటీలు జరుగుతాయని అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వ్యాయామ ఉపాధ్యాయులతో హాజరుకావాలని సూచించారు.

వాణాలలో పీర్ల పండుగ

పాములపాడు, సెప్టెంబరు 18: మండలంలోని వాణాల గ్రామంలో నూతనంగా నిర్మించిన పీర్ల చావిడిలో ఈ నెల 19, 20వ తేదీల్లో మౌలాలి స్వామి సరిగెత్తు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 19న చిన్న సరిగెత్తు గ్రామంలో పీర్ల దేవుళ్ల ఊరేగింపు, 20న పెద్ద సరిగెత్తు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు చేరుకొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నందికొట్కూరు, సెప్టెంబరు 18: నందికొట్కూరు పట్టణంలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. బుధవారం వచ్చిన సమాచారం మేరకు ఐసీడీఎస్ శాఖ అధికారులు, పోలీసుశాఖ సమన్వయంతో పట్టణంలోని హాజీ నగర్‌కు చెందిన బాలిక తల్లిదండ్రుల ఇంటికి వెళ్లారు. మైనర్ బాలికకు వివాహం చేయడం చట్ట రీత్యా నేరమని, చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందని బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో వివాహాన్ని రద్దు చేసుకుంటున్నట్లు వధువు, వరుల కుటుంబ సభ్యులు అంగీకార పత్రాలను పట్టణ ఎస్ఐ సురేష్ బాబుకు అందజేశారు.

పౌష్టికాహారంతో దృష్టి లోపం నివారణ

కొత్తపల్లి, సెప్టెంబరు 18: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకున్నట్లయితే దృష్టి లోపాలను నివారించవచ్చని ఆత్మకూరు కంటి వైద్యాధికారి షేక్షావలి సూచించారు. బుధవారం కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో కంటి వైద్యనిపుణులు షేక్షావలి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 13 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం విద్యార్థులకు దృష్టి లోపాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు మురళి నాయక్, సూపర్‌వైజర్ గురప్ప, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హమాలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 18: హమాలీ కార్మికుల కోసం సమగ్ర చట్టం, వెల్ఫేర్ బోర్డు సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా కల్పించాలని అన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు రఫీ, హుసేన్‌బాషా, మాబాషా, నరసింహారెడ్డి, మౌలాలి, దరగయ్య తదితరులు ఉన్నారు.

పంట కోత ప్రయోగాలతో ప్రయోజనాలు

నంద్యాల రూరల్, సెప్టెంబరు18; పంటలను ముందుగానే అంచనా వేసేందుకు పంటకోత ప్రయోగాలు ఎంతో ఉపయోగపడతాయని నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మండల కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై ఏఈవో, ఎంపీఈవో, వీహెచ్ఏ, వీఏఏ లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టార్గెట్లను నిలిపివేయాలి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 18: ఆచరణకు సాధ్యంకాని టార్గెట్లను నిలిపివేయాలని పోస్టల్ యూనియన్ నాయకులు కోరారు. ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, పోస్ట్‌మెన్, ఎంటీఎస్, గ్రామీణ తపాలా ఉద్యోగల సంఘం పిలుపు మేరకు బుధవారం నంద్యాలలోని డివిజన్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద డివిజన్ సెక్రటరీ జమాల్ బాషా ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగల సంఘం నాయకులు మద్రెడ్డి, జయన్న ఉద్యోగులు సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆశయాలను మార్చుకోకూడదు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 18 : విద్యార్థి దశలో అనుకున్న లక్ష్యాలను సాధించడంలో ఎదురయ్యే సమస్యలతో పోరాడుతూ ఆశయాలను మార్చుకోకూడదని పాలమూరు విశ్వవిద్యాలయం మానసిక తత్త్వవేత్త రాధాకృష్ణారావు అన్నారు. నంద్యాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నగదు విరాళం

పాణ్యం, సెప్టెంబరు 18: వరద బాధితుల సహాయార్థం మండలంలోని నెరవాడకు చెందిన టీడీపీ నాయకులు రూ. 50 వేల నగదు విరాళాన్ని ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో నగదును అందజేశారు. కార్యక్రమంలో అమరసింహారెడ్డి, నారాయణ రెడ్డి, నరసింహారెడ్డి, మునిస్వామిరెడ్డి, భూకాంతరెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): విజయవాడ వరదబాధితుల సహాయంకోసం నంద్యాల ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల నిర్వహకులు దినేష్‌రెడ్డి, డాక్టర్ సూర్యప్రకాష్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధికి నాలుగలక్షల రూపాయల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ చెక్కును మానవవనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు తాడేపల్లిలోని తన నివాసంలో అందజేశారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

మహానంది, సెప్టెంబరు 18: ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ఉపయోగించాలని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం నంద్యాల- మహానంది రహదారిలోని అయ్యన్ననగర్ వద్ద ఎస్ఐ వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్, రవి, మురళి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 18: గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు సంపూర్ణ ఆరోగ్యానికి మంచివని అదనపు సీడీపీవో మంగవల్లి అన్నారు. జూపాడుబంగ్లాలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని, ఎంపీడీవో నూర్జహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

నందికొట్కూరు, సెప్టెంబరు 18: సీపీఎం నాయకుడు భాస్కర్‌రెడ్డి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఈనెల 13వ తేదీన కొణిదేల గ్రామం నుంచి నందికొట్కూరుకు వస్తుండగా ముచ్చుమర్రి గ్రామానికి చెందిన ట్రాక్టర్ బైకును ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలైన భాస్కర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భాస్కర్‌రెడ్డి మృతి చెందినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి: డీడీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

చాగలమర్రి, సెప్టెంబరు 18: గ్రామాల్లో పశువుల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య సూచించారు. బుధవారం చాగలమర్రి ప్రాంతీయ పశువైద్యశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు, నిర్వహణ సేవలను, టీకాల కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల డివిజన్ పరిధిలోని 17 మండలాలకు 325 మినీ గోకులాలు మంజూరయ్యాయని, వీటికి 600 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. 75 మెట్రిక్ టన్నుల పశుదాణ వచ్చిందని, దాణ కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకుంటే రెండో విడత పంపిణీకి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని అన్నారు. పశుగ్రాసం కటింగ్ చేసే 10 యంత్రాలు మంజూరయ్యాయని తెలిపారు. చాగలమర్రి, మద్దూరు పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన భవనాల నిర్మాణాలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. పశువైద్యాధికారులు, వైద్య సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్, పశువైద్యాధికారి సాయిబాబా, కోటయ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి

డోన్, సెప్టెంబరు 18: సీఎం చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్ పైసా నిధులను ఇవ్వకుండా నిర్వీర్యం చేశారన్నారు. సీఎం చంద్రబాబు వచ్చిన తర్వాత బీసీల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. బుధవారం కేబినెట్ బేటీలో సీఎం చంద్రబాబు బీసీ కార్పొరేషన్లను పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, సెప్టెంబరు 18: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల పేర్కొన్నారు. బుధవారం చాగలమర్రి బాలుర, బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతరమైన రీతిలో బోధన చేయాలన్నారు. బోధనలో మెలకువల గురించి తెలియజేశారు. హెచ్‌ఎంలు కోటయ్య, విజయలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.

గోవిందపల్లెలో చోరీ

శిరివెళ్ల, సెప్టెంబరు 18: మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన బద్రి శ్రీనివాసులు అనే వ్యక్తి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బద్రి శ్రీనివాసులు వ్యవసాయ పనుల కోసం ఇంటికి తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపుకు ఉన్న తాళం ధ్వంసం చేసి ఇంటిలోకి చొరబడి బీరువాలోని నగదు, బంగారు ఆభరణాలు అపహరించుకొని వెళ్లినట్లు బాధితుడు శ్రీనివాసులు వాపోయాడు. విషయం తెలుసుకున్న శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ విషయంపై ఎస్ఐను వివరణ కోరగా దొంగతనం ఘటనపై అన్ని కోణాల్లో విచారిస్తున్నామని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

కోవెలకుంట్లలో..

కోవెలకుంట్ల: పట్టణంలోని ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న రాందేవ్ కిరాణాషాప్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీ చేశారు. కిరాణా షాపు యజమాని భూపాల్ ప్రతిరోజులాగానే మంగళవారం రాత్రి వరకు షాపు నిర్వహించుకుని తాళం వేసిరాత్రి ఇంటి కివెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి బాక్సులోని రూ.35వేలు దొంగలించుకుని వెళ్లారు. ఉదయం షాపు యజమాని వచ్చి చూసేసరికి దొంగతనం జరిగి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం: టీడీపీ



చెర్వుపల్లెలో మొక్క నాటుతున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, సెప్టెంబరు 17: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండలంలోని చెర్వుపల్లె టీడీపీ నాయకుడు శరత్‌బాబు అన్నారు. బుధవారం రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ ఇందిరమ్మ ఆదేశాల మేరకు గ్రామ టీడీపీ నాయకులతో కలసి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకుడు శరత్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చెట్లను నాటి గ్రామాలను పచ్చదనంతో నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ సర్పంచ్ మద్దిలేటి, రామకృష్ణ, రామసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులపై ఒత్తిళ్లు

శిరివెళ్ల, సెప్టెంబరు 18 : తపాలా శాఖలో ఆచరణకు సాధ్యం కాని టార్గెట్‌లతో పోస్టల్ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తపాలా ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఖాజా మొహిద్దీన్ అన్నారు. ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం, పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ పోస్ట్‌మ్యాన్, ఎంటీఎస్‌ల సంయుక్త సంఘాల పిలుపు మేరకు శిరివెళ్లలో నిరసన వ్యక్తం చేస్తూ నంద్యాల పోస్టల్ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం పోస్టల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శశి కుమార్, లింగమూర్తి, జయన్న, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ మార్గంలో నడవాలి

రుద్రవరం, సెప్టెంబరు 18: దైవమార్గంలో నడవాలని ఆటో యాత్రికుడు అబ్దుల్‌గఫార్ అన్నారు. బుధవారం మండలంలోని నరసాపురం, ఆలమూరు గ్రామాల్లో ఆటోయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవాన్ని వదిలి ప్రమాదాలకు, దెబ్బలకు దేహాన్ని అంకితం చేయొద్దని సూచించారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

రుద్రవరం, సెప్టెంబరు 18: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. బుధవారం రుద్రవరంలో పారిశుధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రుద్రవరంలో మూడు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వైద్యసిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

మార్పు మంచికే..

- డోన్ నుంచి నంద్యాలకు మారిన విద్యావ్యవస్థ
- పరిపాలనా సౌలభ్యం కోసమేనంటున్న అధికారులు
- స్వాగతిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 18: సుదీర్ఘ కాలం నుంచి డోన్ డివిజన్‌లో ఉన్న కొలిమిగుండ్ల, సంజామల మండలాల విద్యా వ్యవస్థను విద్యాశాఖ అధికారులు నంద్యాల డివిజన్‌కు మార్చారు. డిప్యూటీ డీఈవో వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి కొలిమిగుండ్ల, సంజామల మండలాలు డోన్ డిప్యూటీ డీఈవో పరిధిలోనే పాలన సాగేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టి, నూతనంగా నంద్యాల జిల్లా ఏర్పాటు చేసింది. ఆ సమయంలో డోన్ డిప్యూటీ డీఈవో వ్యవస్థ నుంచి నంద్యాల డివిజన్‌కు మార్చాలన్న ప్రతిపాదన ఉపాధ్యాయ సంఘాలతో పాటు వివిధ వర్గాల నుంచి వ్యక్తమైంది. కొలిమిగుండ్ల, సంజామల మండలాలకు చెందిన ఉపాధ్యాయులు వివిధ పనుల నిమిత్తం డిప్యూటీ డీఈవో కార్యాలయానికి డోన్‌కు వెళ్లాలంటే ఎన్నో వ్యయ ప్రయాసాలు పడాల్సిన పరిస్థితి. ఈ మండలాల నుంచి డోన్‌కు సరైన రోడ్డు మార్గం కానీ, రవాణా మార్గం కానీ లేని పరిస్థితి. దీంతో డోన్ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనా సౌలభ్యం కోసం కొలిమిగుండ్ల, సంజామల మండలాలను నంద్యాల డివిజన్ కిందకు మార్పు చేశారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, అనుబంధ వ్యవస్థ వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నంద్యాలకు మార్చడం హర్షణీయం



కొలిమిగుండ్ల మండలాన్ని డోన్ డివిజన్ నుంచి నంద్యాల డివిజన్‌కు మార్చడం హర్షణీయం. ఉపాధ్యాయులు ఇక్కడి నుంచి ఆ చివరకు వెళ్లేందుకు ఎంతో ఇబ్బందిగా ఉండేది. రవాణ సౌకర్యం కూడా లేకపోవడంతో చాలా అవస్థలు పడ్డారు. నంద్యాలకు మార్చడం ఎంతో శ్రమ తగ్గుతుంది.

\- వైవీఎస్ నారాయణరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత

పాలనా సౌలభ్యం కోసమే..



పరిపాలనా సౌలభ్యం కోసమే డివిజన్ మార్పు చేశాం. విషయాన్ని ఇప్పటికే కొలిమిగుండ్ల, సంజామల మండలాల అధికారులకు తెలియజేశాం.

\- సుధాకరరెడ్డి,
డీఈవో, నంద్యాల జిల్లా

వైభవంగా చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలు



చౌడేశ్వరీ దేవికి పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 18: కోవెలకుంట్ల మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో బుధవారం చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్దనరెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఇందిరమ్మకు గ్రామ టీడీపీ నాయకులు గజ్జల హుసేనయ్య, పెద్దహుసేనయ్య, రాధాక్రిష్ణమూర్తి, మనోహర్, సుబ్బరాయుడు స్వాగతం పలికారు. అక్కడ నుంచి చౌడేశ్వరి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి అందరూ బాగుండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, కోవెలకుంట్ల మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, మండల ఉపాధ్యక్షుడు కలుగొట్ల అర్జున్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గడ్డం అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని కోటపాడు గ్రామంలో చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన జ్యోతులను ఊరేగించారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. సీనియర్ టీడీపీ నేత మూల శివారెడ్డి, సీతారామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గ్రామపెద్దలు చంద్రశేఖరరెడ్డి, కిట్టయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలు





డోన్‌లో రక్తదానం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

డోన్, సెప్టెంబరు 18: కేంద్ర మాజీ మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కేకును కట్ చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, తెలుగు యువత కార్యకర్తలు, రక్తదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనాయుని పల్లె శ్రీనివాసులు యాదవ్, మాజీ ఎంపీటీసీ దేవరబండ వెంకటనారాయణ గౌడ్, టిఈ రాఘవేంద్ర గౌడ్ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ఎమ్మెల్యే కోట్ల కృషి చేస్తున్నార న్నారు. అదేవిధంగా తెలుగు యువత నాయకులు దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో పాతబస్టాండులో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం చేసి కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను పార్టీ ముఖ్య నాయకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపానిపల్లె మల్లయ్య, మిద్దెపల్లి గోవిందు, ఎల్ఐసీ శ్రీరాములు, రామదుర్గం జయరాముడు, బి.రాముడు మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య ఈశ్వరాచారి, మల్లీశ్వరయ్య, బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద డోన్ ఎమ్మెల్యే కోట్ల జన్మదినం పురస్కరించుకుని ప్యాపిలి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన లక్ష్మన్న ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేప ట్టారు. వడ్డె గణమద్దయ్య రామదాసు, నారాయణ పాల్గొన్నారు.

- కోట్ల జన్మదినం పురస్కరించుకుని మండలంలోని కామగానిగుంట్ల గ్రామ సమీపంలోని కనుమ తిమ్మరాయుడు ఆలయంలో టీడీపీ నాయకులు సీలం భాస్కర్ నాయుడు శ్రీలత దంపతులు, ఆలేబాదు ప్రకాష్, ఉడుములపాడు నాగేంద్ర, బ్రహ్మానందరెడ్డి, ఆర్‌మీ రామయ్య పూజలు చేశారు. అలాగే మండలంలోని ఆవులదొడ్డి గ్రామ సమీపంలోని లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో జనసేన నియోజకవర్గ నాయకుడు ఆలా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు.

ప్యాపిలి: పట్టణంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు బర్త్‌డే కేక్ కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయ కులు లక్ష్మసాగరం లక్ష్మీరెడ్డి, రాజానారాయణమూర్తి, వై లక్ష్మీనారాయణ యాదవ్, టి శ్రీనివాసులు, ఖాజాపీర్, రామ్మోహన్‌యాదవ్, చల్లా వీరాం జినేయులు, అంకిరెడ్డి, మధుకుమార్, టి లింగన్న, నాగేంద్ర, ఎస్ మధు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో స్వీట్లు పంపిణీ: మండలంలోని అలేబాదు, మాధవ రం, గార్లదిన్నే, బావిపల్లి, మామిళ్లపల్లి, ఏనుగమర్రి, మెట్టుపల్లి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే కోట్ల జన్మదినాన్ని పురస్కరించుకొని టీడీపీ నాయ కులు, కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేసుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అలేబాదు పరమేష్, శ్రీకాంత్, కర్ణం రామ్, సుదర్శన్, కుమ్మరి సుధాకర్, రాంభూపాల్, శ్రీనివాసులు యాదవ్, శివప్ర సాద్ పాల్గొన్నారు.



ప్యాపిలిలో స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న టీడీపీ నాయకులు



బేతంచెర్లలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బేతంచెర్ల: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య అధ్యక్షతన డోన్ ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, కేక్ చట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని శేషారెడ్డి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు చరణ్‌రాజు, స్వప్న ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ఉన్న బాలింతలకు, గర్భిణులకు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేశ్ చౌదరి, మేకల నాగరాజు, రూబెన్, వేంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సుధాకర్, బీమేశ్వరరెడ్డి, రవీంద్ర నాయక్, వార్డు కౌన్సిలర్లు రామగోపాల్, రామాంజ నేయులు, అంబాపురం సర్పంచ్ శ్రీనివాసులు యాదవ్, గోపాల్ రెడ్డి, మధులోకేశ్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత: ఎంపీడీవో

దొర్నిపాడు, సెప్టెంబరు 18: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని దొర్నిపాడు కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచి నీటిని కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. అనంతరం కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్యాపిలి: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బుధవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. అధ్యాపకులు నవీన్‌పాటి, సత్యబాబు, ఓబులేసు, నవీన్, ముస్తాక్ పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలో ఎంపీడీవో నాగరాజు, ఎంఈవో స్వరూప, ప్రభుత్వ బాలుర, ఉన్నత పాఠశాల విద్యా ర్థులు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై నిర్వహించారు. ఇందులో భాగంగా నీరు నిల్వ ఉన్న చోట పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.



బనగానపల్లెలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 18: వాల్మీకులు తమ హక్కుల సాధన కోసం ఐకమత్యంగా పోరాడాలని ఏపీ బోయ వాల్మీకి సమితి జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం డోన్ పట్టణ ప్రధాన కూడలి ప్రాంతాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. అంతకుమునుపు డోన్ కంబల పాడు సర్కిల్ ప్రాంతంలో ఉన్న వాల్మీకి సర్కిల్ వద్ద ఈనెల 22న జరిగే వాల్మీకుల వర్క్‌షాపును జయప్రదం చేయాలని పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, శివ, శ్రీరాములు, విజయ్, ఎర్రిస్వామి, సురేంద్ర, కేశవయ్య పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల సీట్లు రద్దు అన్యాయం

చాగలమర్రి, సెప్టెంబరు 18: రాయలసీమలోని పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన సీట్లను రద్దు చేయడం అన్యాయమని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు జగన్, కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. బుధవారం చాగలమర్రి వాసవీ డిగ్రీ కళాశాలలో వారు మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ద్వారా 50ఎంబీబీఎస్ సీట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలో వసతులు లేవని, నడపలేమంటూ తిరిగి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించడం అన్యాయం అన్నారు. సీట్ల విషయంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి తిరిగి పులివెందుల మెడికల్ కళాశాలకు మూడో విడతలో సీట్లు కేటాయించి ప్రభుత్వమే కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

బనగానపల్లె, సెప్టెంబరు 17: బనగానపల్లె మండల సర్వసభ్య సమావేశం ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగరాజు బుధవారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

కార్మికుల కడుపు కొట్టొద్దు

బేతంచెర్ల, సెప్టెంబరు 18 : మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో ఉన్న సిమెంటు ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న 550 మంది కార్మికుల కడుపులు కొట్టవద్దని ఫ్యాక్టరీ కార్మికులు మహబూబ్ బాషా, నాగమద్దయ్య కోరారు. ఈ సందర్భంగా సమ్మె నోటీసులను యజమాన్యానికి అందజేశారు. బుధవారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలోని పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ పాత యాజమాన్యం ఉన్న సమయంలో 2008లో మూతపడగా.. కార్మికుల కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అహోబిలంలో పౌర్ణమి వేడుకలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 18: అహోబిలంలో పౌర్ణమి వేడుకలను వేద పండితులు నిర్వహించారు. బుధవారం ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను అలంకరించి విశేష పూజలు చేపట్టిన అనంతరం అభిషేకించారు. గ్రామ వీధుల్లో గ్రామోత్సవం చేపట్టి, భక్తులకు తీర్థప్రసాదాలను అందించినట్లు చెప్పారు.

వైభవంగా దీపోత్సవం

చాగలమర్రి, సెప్టెంబరు 18: చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం తెల్లవారుజామున మహిళలు సామూహికంగా దీపోత్సవం నిర్వహించారు. 108 దీపాలు వెలిగించి శివ పార్వతులకు ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో లలిత సహస్ర పారాయణం, విష్ణు సహస్రపారాయణం చేశారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

సంజామల, సెప్టెంబరు 18: సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సరళాదేవి మంగళవారం కోరారు. అభ్యర్థులు ఎం.ఎస్.సీ కెమిస్ట్రీ చేసి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులకు ఈ నెల 24న డెమో క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల్లో విరాళాలు సేకరిస్తున్నట్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల జిల్లా అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. పడకండ్ల హైపీఎం పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి తమకు తోచినంత నిధులు ఇవ్వాలని, యాజమాన్యాలు సైతం విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

అవుకు, సెప్టెంబరు 18: మండలంలోని రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యశాఖ ఏడీ మారుతీ సకారం బుధవారం అన్నారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మారేమడుగుల, కొండమనాయునిపల్లె, కొండమనాయునిపల్లెతండా గ్రామాలకు వెళ్లి రైతులతో సమావేశాన్ని నిర్వహించి పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశామన్నారు. అలాగే జీవాలు పుర్రు రోగం బారిన పడకుండా పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో కొండమనాయునిపల్లె గ్రామ టీడీపీ నాయకులు ఆకుల నాగిరెడ్డి, ఎల్లాల శివారెడ్డి, విశ్వనాథరెడ్డి, బోర్ శివారెడ్డి పసుపల, యాగంటిపల్లె పశువైద్యాధికారులు రాంకుమార్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

శిరివెళ్ల, సెప్టెంబరు 18: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని యర్రగుంట్ల ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి అన్నారు. అండర్-15 విభాగంలో 38వ రాష్ట్ర హ్యాండ్‌బాల్ బాయ్స్ అండ్ గర్ల్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ మహబూబ్ బాషా, కోచ్‌లు సర్దార్, మహారాజ్, షావలిలు యర్రగుంట్లలో తర్ఫీదునిచ్చారు. క్రీడాకారులు ఈ నెల 20న కడప జిల్లా వెంపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. అనంతరం అసోసియేషన్ సెక్రటరీ మహబూబ్ బాషా క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కమతం సుబ్బారెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్, జమాల్ బాషా, శ్రీరాములు, దాదాబాషా పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఎంపిక పోటీలు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 18: ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈపోటీలు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభ మవుతాయన్నారు. అండర్-14, 17 ఏళ్లలోపు బాలిబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. హెచ్‌ఎం రాజయ్య పాల్గొన్నారు.

అవుకు: అవుకు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 20వతేదీన మండల స్థాయి క్రీడల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీధర్‌రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ - 14, అండర్ - 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా క్రీడల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడల్లో మండలంలోని పాఠశాలలకు చెందిన బాలురు, బాలికలు పాల్గొన వచ్చన్నారు. క్రీడల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిల్ పోటీలు

రుద్రవరం, సెప్టెంబరు 18: రుద్రవరం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నిర్వహించిన స్లో సైకిల్, పరుగు పందెం పోటీలను ఇన్‌చార్జి ఎంపీడీవో వరలక్ష్మి ప్రారంభించారు. బుధవారం విద్యార్థులకు రుద్రవరం నుంచి రెడ్డిపల్లెమెట్ట వరకు పరుగుపందెం, స్లో సైకిల్ పందెలు, బాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లక్ష్మి, ఈవో సుబ్బారావు తదితరులున్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

చాగలమర్రి, సెప్టెంబరు 18: చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ అన్నారు. బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. సర్పంచ్ తులశమ్మ, హెచ్‌ఎం కోటయ్య, పీడీ దాదాపీర్, టీడీపీ నాయకులు జెట్టి నాగరాజు, వీఆర్వో శారద, ఏఎన్ఎం గార్లెట్, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యునెస్కో గుర్తింపునకు సిఫారసు చేయాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 18: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రతి ఏడాది జనవరి మాసంలో జరిగే పార్వేట ఉత్సవాలకు యునెస్కో గుర్తింపునకు సిఫారసు చేయాలని అహోబిలానికి చెందిన సేతురామన్ కోరారు. బుధవారం ఆయన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్‌ను కలిసి పార్వేట ఉత్సవాలకు గల ప్రాధాన్యతను వివరించారు. దీనిపై మంత్రి స్పం దించి తప్పకుండా ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 18: మండలంలోని అన్ని గ్రామాల గ్రీన్ అంబాసిడర్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉయ్యాలవాడ, మాయలూరు గ్రామాల పీహెచ్‌సీల పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కెనెడీ, ఎంపీహెచ్‌ఈవో దస్తగిరి, గ్రామల కార్యదర్శులు రహీం, రమేష్, హసీనా తదితరులు పాల్గొన్నారు.